# ప్రజా ఆశీర్వాద సభను సక్సెస్ చేయండి

- సభకు ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి
- ఈ నెల 27న రానున్న సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే అరూరి రమేశ్‌తో కలిసి భట్టుపల్లి ఎస్సార్ కాలేజీ మైదానం పరిశీలన
- సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ వివరాలపై ఆరా


పర్వతగిరి : జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

మడికొండ, అక్టోబర్ 24 : గ్రేటర్ 44వ డివిజన్ భట్టుపల్లి శివారులోని ఎస్ఆర్ కళాశాల మైదానంలో ఈ నెల 27న నిర్వహించనున్న వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే అరూరి రమేశ్‌తో కలిసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించారు. ఈ సభకు సీఎం కేసీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ తదితర విషయాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంతరాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సభా స్థలిలో చేపడుతున్న పనుల గురించి ఎమ్మెల్యే అరూరి మంత్రికి వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పర్వతగిరిలో జమ్మి పూజ**

పర్వతగిరి : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగ నిలుస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలో సోమవారం దసరా వేడుకలు కనుల పండువగా జరిగాయి. కార్యక్రమలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం రావణవధ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ దసరా వేడుకలను జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పండుగను స్ఫూర్తిగా తీసుకుని విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్, పర్వతగిరి సర్పంచ్ చింతపట్ల మాలతీ సోమేశ్వర్‌రావు, ఎంపీటీసీలు మాడుగుల రాజు, బొట్ల మహేంద్ర, బీఆర్ఎస్ నాయకులు సోమేశ్వర్‌రావు, బొట్ల శ్రీకాంత్, చిన్నపెల్లి అజయ్ పాల్గొన్నారు. అలాగే, మండలంలోని అన్నారం, ఏనుగల్లు గ్రామాల్లో కూడా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కొంకపాకలో దుర్గా మాతా విగ్రహం వద్ద ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మద్దెల రాజు నేతృత్వంలో అర్చకుడు సత్యనారాయణ శర్మ ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రశాంత్, రామ్‌చందర్, రాజు పాల్గొన్నారు.

## ‘ఎర్రబెల్లి దయన్నకే సంపూర్ణ మద్దతు..’

పర్వతగిరి, అక్టోబర్ 24 : హైదరాబాద్‌లో స్థిరపడిన పాలకుర్తి నియోజకవర్గంలోని రాయపర్తి మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన పలువురు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మద్దతు తెలిపారు. దసరా వేడుకల కోసం గ్రామానికి వచ్చిన వీరంతా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆయన స్వగ్రామం పర్వతగిరికి మంగళవారం ప్రత్యేకంగా వచ్చి కలిశారు. వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి చేసి చూపించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకే తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధికి వారంతా ఫిదా అయ్యారు. మంత్రిని కలిసిన వారిలో ఆరెగూడేనికి చెందిన ఇటిక్యాల సుమన్, కడుదుల వెంకటేశ్, సురవు ప్రవీణ్, ఎంగిలి అనిల్, వరికాల రామకృష్ణ, ఇటిక్యాల హరీశ్, గుల్లపెల్లి ప్రసాద్, తుమ్మరపెల్లి రంజిత్, పెండ్లి సుధాకర్, గాజులపాటి నర్మద, తోట సుదర్శన్, కడుదుల సురేశ్ ఉన్నారు.


ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మద్దతు తెలుపుతున్న ఆరెగూడెం వాసులు


కల్యాణోత్సవంలో తాళి చూపిస్తున్న అర్చకుడు

## కనులపండువగా తెప్పోత్సవం

- భద్రకాళీ చెరువులో హంసవాహనంపై అమ్మవారి ఊరేగింపు
- వైభవంగా భద్రకాళీ-భద్రేశ్వరుల కల్యాణోత్సవం
- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పరిసమాప్తం

వరంగల్, అక్టోబర్ 24 : భద్రకాళీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి రోజు సాయంత్రం భద్రకాళీ చెరువులో తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. సోమవారం రాత్రి భద్రకాళీ చెరువులో విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించిన హంస వాహనంపై భద్రకాళీ అమ్మవారిని ఊరేగించారు. తెప్పోత్సవం కార్యక్రమానికి వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, తెప్పోత్సవం శాశ్వత దాత, వ్యాపారవేత్త వద్దిరాజు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వారికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఉదయం భద్రకాళీ అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం జరిపి, చక్రస్నానం చేయించారు. ప్రధాన అర్చకుడు శేషు నేతృత్వంలో పూజలు నిర్వహించారు. తెప్పోత్సవం కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. దీంతో భద్రకాళీ నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భద్రకాళీ ఆలయంలో తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాలు విజయదశమితో ముగిశాయి. పండుగ రోజు ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు.

**వైభవంగా కల్యాణోత్సవం**

భద్రకాళీ–భద్రేశ్వరుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం భద్రకాళీ ఆలయ ప్రాంగణంలో పూలతో అందంగా అలంకరించిన కల్యాణ మండప వేదికపై కల్యాణ మహోత్సవాన్ని ప్రధాన అర్చకుడు శేషు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మూడు రోజుల కిత్రం గంజి కేదారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మగ్గంపై పద్మశాలీ మేళా కమిటీ కళాకారులు నేసిన గద్వాల్ చీరను భద్రకాళీ అమ్మవారికి సమర్పించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భద్రకాళీ–భద్రేశ్వరుల కల్యాణోత్సవంతో శరన్నవరాత్రి ఉత్సవాలు పరిసమాప్తమైనట్లు అర్చకులు తెలిపారు.


దివ్యాంగుడు మహేశ్‌తో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

## సారే కావాలి... కారే రావాలి

**దివ్యాంగుడి జన చైతన్య యాత్ర**

**హనుమకొండలో అభినందించిన చీఫ్ విప్**

హనుమకొండ, అక్టోబర్ 24 : ‘సారే కావాలి... కారే రావాలి’ అని దివ్యాంగుడు డీ మహేశ్ జన చైతన్య యాత్ర చేపట్టారు. మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి మండలం లింగాపుర్ తండాకు చెందిన మహేశ్ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రచారం, బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు గత పద్దెనిమిది రోజుల క్రితం జన చైతన్య యాత్రను చేపట్టారు. ఈ యాత్రను నిజామాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత ప్రారంభించగా ఇప్పటి వరకు నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల మీదుగా వరంగల్, హనుమకొండ జిల్లాలో పర్యటించి, ప్రచారం చేశారు. ఇందులో భాగంగా మంగళవారం చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌ను మహేశ్ కలిసి జన చైతన్య యాత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా దివ్యాంగుడు మహేశ్‌ను చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ అభినందించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం రూ.4046 పింఛన్ ఇస్తుందన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే రూ.6016కు పెంచుతామని కేసీఆర్ ప్రకటించడంతో కృతజ్ఞతా భావంతో కేసీఆర్ మూడోసారి సీఎం కావాలనే సంకల్పంతో ఈ యాత్ర చేపట్టినట్లు మహేశ్ తెలిపారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో తామూ లబ్ధి పొందుతున్నామని.. ఇంకా అభివృద్ధి జరుగాలంటే కేసీఆర్‌కే మళ్లీ ఓటు వేసి, సీఎం చేయాలని ప్రజలు అంటున్నారని తెలిపారు.

# బొగత జలపాతం వద్ద ‘దసరా’ సందడి

**సెల్ఫీలు, కేరింతలతో పర్యటకుల కోలాహలం**

వాజేడు, అక్టోబర్ 24 : విజయదశమి(దసరా) సెలవులు కావడంతో మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగర బొగత జలపాతం అందాలను చూసేందుకు మంగళవారం రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. బొగత అందాలను వీక్షించారు. జలపాతం ముందు భాగంలో తెలంగాణ నయగార అందాలను చూసి ఫిదా అయ్యారు. జలపాతం ముందు స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలసి సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సందడి చేశారు. జలపాతం ఎదుట నీటిలో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. దసరా పండుగ కావడంతో పర్యాటకులతో జలపాతం పరిసరాల్లో కోలాహలం నెలకొంది. 50 అడుగుల పైనుంచి జాలువారుతున్న జలపాతం అందాలకు అందరూ ముగ్దులయ్యారు.


జలపాతం వద్ద స్నానాలు చేస్తూ సందడి చేస్తున్న పర్యాటకులు


రామప్పగుడిలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

## కిక్కిరిసిన రామప్ప ఆలయం

వెంకటాపూర్, అక్టోబర్ 22 : మండలంలోని పాలంపేట గ్రామంలో రామప్ప దేవాలయం దసరా సెలవుల సందర్భంగా మంగళవారం పర్యాటకులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, బెంగాల్, ఢిల్లీతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజరులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా ఆసక్తిగా విని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయంలో ఉత్సాహంగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని పర్యాటక శాఖ వారి బోట్లలో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.